నిర్మల్ జిల్లా భైంసాలో అర్ధనగ్నంగా నిరాహార దీక్ష చేస్తున్న కొత్తూర్ శంకర్

దళితబంధు కోసం నిరాహార దీక్ష

భైంసాలో లబ్ధిదారుడి అర్ధనగ్న ప్రదర్శన

భైంసా, జనవరి 19: దళితబంధు నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం నిర్మల్ జిల్లా భైంసాలో ఓ లబ్ధిదారుడు నిరాహార దీక్ష చేపట్టాడు. స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద లబ్ధిదారు కొత్తూర్ శంకర్ చేపట్టిన దీక్షలో అర్ధనగ్నంగా కూర్చొని నిరసన తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వం రెండో విడత కింద దళితబంధు లబ్ధిదారులను ఎంపిక చేసిందని ఆయన గుర్తుచేశారు. ముథోల్ నియోజకవర్గంలో 1100 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారని, ఇందుకు సంబంధించిన డబ్బులను ఇప్పటికే కలెక్టర్ ఖాతాలో వేశారని పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ కారణంగా గతంలో ఖాతాల్లో నగదు వేసే ప్రక్రియ నిలిచిపోయిందని, వెంటనే ఆ డబ్బులను లబ్ధిదారుల ఖాతాలో జమ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే దళితులంతా ఆమరణ నిరాహార దీక్ష చేపడతారని హెచ్చరించారు. ఈ నిరసనకు అన్నాబావు సాటే సంఘం జిల్లా అధ్యక్షుడు ఉత్తం బాలేరావు, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు సుంకెట మహేశ్, మోచీ సంఘం జిల్లా అధ్యక్షుడు సాయినాథ్ మద్దతు తెలిపారు.

- నల్లగొండ కలెక్టరేట్ వద్ద నిరసన

దళితబంధుకు ఎంపికైన వారికి నిధులు విడుదల చేయాలని దళితబంధు సాధన సమితి నల్లగొండ జిల్లా కన్వీనర్ పాలడుగు నాగార్జున, తెలంగాణ విద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షుడు పీ సైదులు డిమాండ్ చేశారు. శాలిగౌరారం మండల లబ్ధిదారులతో కలిసి శుక్రవారం నల్లగొండ కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. ప్రభుత్వం భేషజాలకు పోకుండా దళితబంధు గ్రౌండింగ్ చేపట్టాలని కోరారు. – నల్లగొండ

దళితులపై కాంగ్రెస్‌ది కపటప్రేమ

- దళితబంధును కొనసాగించాలి
- టీఎమ్మార్పీఎస్ నేత వంగపల్లి

గోదావరిఖని, జనవరి 19: తెలంగాణలో దళితులపై కాంగ్రెస్ సర్కారు కపటప్రేమ చూపుతున్నదని, నిజంగా చిత్తశుద్ధి ఉంటే బీఆర్ఎస్ ప్రభుత్వం తెచ్చిన దళితబంధు పథకాన్ని కొనసాగించాలని టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ డిమాండ్ చేశారు. శుక్రవారం పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో నిర్వహించిన టీఎమ్మార్పీఎస్ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. వేల సంవత్సరాలుగా సామాజిక వివక్షకు గురైన దళితుల బతుకుల్లో వెలుగులు నింపేందుకు కేసీఆర్ ప్రభుత్వం ఈ బృహత్తర పథకాన్ని తెచ్చిందని గుర్తుచేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకం అమలుపై నిర్లక్ష్యం చేయొద్దని విజ్ఞప్తి చేశారు. మాదిగలను ఓటు బ్యాంకుగా చూడకుండా సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో టీఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు యాసర్ల రాజ్‌కుమార్, కోర్ కమిటీ సభ్యుడు కొట్టెపల్లి దుర్గా ప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్ నాగరాజు, ఎంఎస్ఎఫ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఈర్ల ప్రేమ్‌కుమార్, మేడి ప్రవీణ్, మాచర్ల శ్రీనివాస్, కుమ్మరి నవీన్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

వర్సిటీ భూములను కాపాడుకుందాం

- జీవో 55 రద్దు చేసే దాకా పోరాటం
- 11వరోజు విద్యార్థుల నిరసన
- హెచ్‌వోడీల నిర్బంధం
- నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు: రిజిస్ట్రార్ హెచ్చరిక

వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఆందోళన చేస్తున్న విద్యార్థులు

వియ్ వాంట్ జస్టిస్

వ్యవసాయ యూనివర్సిటీ, జనవరి 19 (నమస్తే తెలంగాణ): వ్యవసాయ వర్సిటీ భూములను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైన ఉన్నదని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ యూనివర్సిటీ విద్యార్థులు పేర్కొన్నారు. అందరం కలిసి జీవో నెం 55 రద్దు చేసేదాకా పోరాడుదామని పిలుపునిచ్చారు. 11వరోజు నిరసనలో భాగంగా శుక్రవారం ఉదయం 10.30 గంటల నుంచే వర్సిటీ ప్రధాన గేట్లు మూసి, 10 డిపార్ట్‌మెంట్ల హెవోఓడీలను నిర్బంధించారు. 'సేవ్ ద యూనివర్సిటీ ల్యాండ్స్', 'సేవ్ ఫార్మర్స్', 'స్టూడెంట్ పవర్.. నేషనల్ పవర్' అంటూ పెద్ద ఎత్తున నినదించారు. రాజేంద్రనగర్‌తోపాటు రాష్ట్రంలోని పాలెం, వరంగల్, సిరిసిల్ల, అశ్వరావుపేట, జగిత్యాల, ఆదిలాబాద్, సంగారెడ్డి వ్యవసాయ కళాశాలల్లోనూ నిరసనలు కొనసాగాయి. శాస్త్రవేత్తలు, టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగులు, కొందరు పరోక్షంగా మద్దతు తెలిపినా వారిపై ఉన్నతాధికారులు ఒత్తిడి తెస్తున్నారని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు.

వర్సిటీని చీల్చడం సరికాదు

సిరులు పండించడంతోపాటు దేశానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా అన్నం పెడుతున్న గుండెకాయవంటి వ్యవసాయవర్సిటీని చీల్చడం సరికాదని పలువురు వక్తలు సూచించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికీ పీసీసీ అధ్యక్షుడిగానే కాకుండా రాష్ట్ర బాగోగుల గురించి బాధ్యతగా ఆలోచించాలని పేర్కొన్నారు. జీవో నంబర్ 55ని వెనక్కి తీసుకొని, వర్సిటీని కాపాడాలని కోరారు. వర్సిటీ విద్యార్థి సంఘాల నాయకులు రాజ్‌కుమార్, శ్రీజ, అరవింద్, మధుకర్, సత్యమూర్తి, సురేందర్, దీక్షిత్, భానుచందర్, హరిప్రియ, శిరీష, అరవింద్, వంశీచందర్‌రెడ్డి, వినయ్‌రెడ్డి, శంకర్ నాయక్, రాకేశ్ పాల్గొన్నారు. కాగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా స్థానిక పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా విద్యార్థులు వ్యవహరించాలని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ వెంకటరమణ హెచ్చరించారు.

వర్సిటీ భూములు తీసుకోవడం సరికాదు

- సీపీఎం రాష్ట్ర కమిటీ

హైదరాబాద్, జనవరి 19 (నమస్తే తెలంగాణ): హైకోర్టు నిర్మాణానికి వ్యవసాయ వర్సిటీ భూములు తీసుకోవడం సరికాదని సీపీఎం రాష్ట్ర కమిటీ పేర్కొన్నది. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయానికి చెందిన వంద ఎకరాల భూమిని హైకోర్టు నిర్మాణానికి కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన జీవో 55ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేసింది. వ్యవసాయ విశ్వవిద్యాలయ భూముల్లో కాకుండా ఇతర ప్రభుత్వ స్థలాల్లో హైకోర్టును నిర్మించాలని కోరింది. ఈ మేరకు సీపీఎం రాష్ట్ర కమిటీ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ప్రభుత్వం కేటాయించిన భూముల్లో వ్యవసాయం దాని అనుబంధ రంగాలైన పశు సంవర్ధక, ఉద్యాన, పట్టుపరిశ్రమ తదితర రంగాలపై పరిశోధనలతోపాటు 'బయోడైవర్సిటీ ప్లాంటేషన్' కొనసాగుతున్నదని ప్రభుత్వానికి గుర్తుచేసింది.

అయోధ్యకు రండి

- సీఎంలు, మాజీ సీఎంలు, ఇతర ప్రముఖులకు ఆహ్వానాలు
- కేసీఆర్‌కు ఆహ్వాన పత్రిక పంపిన శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్

హైదరాబాద్, జనవరి 19 (నమస్తే తెలంగాణ): ఈ నెల 22న అయోధ్యలో నిర్వహించనున్న రామమందిర ప్రారంభోత్సవానికి రావాల్సిందిగా తెలుగురాష్ట్రాల్లోని పలువురు ప్రముఖులకు శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ ఆహ్వానం పలికింది. దేశవ్యాప్తంగా అన్ని రాజకీయ పార్టీల అధ్యక్షులు, ముఖ్యమంత్రులు, మాజీ ముఖ్యమంత్రులతోపాటు ప్రముఖులు అందరికీ ఆహ్వానాలు పంపిన ట్రస్ట్.. బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్‌తోపాటు టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబుకు కూడా ఆహ్వాన పత్రికలు పంపింది. అయితే, కేసీఆర్‌కు ఇటీవలే తుంటి ఎముక ఆపరేషన్ జరిగినందున కార్యక్రమానికి హాజరయ్యే అవకాశం లేదని పార్టీ వర్గాలు తెలిపాయి.

ఆటో డ్రైవర్ ఆత్మహత్య

- అప్పు తీర్చలేక బలవన్మరణం

హైదరాబాద్ సిటీబ్యూరో/బొంరాస్‌పేట జనవరి 19 (నమస్తే తెలంగాణ): గిరాకీ లేక.. ఆటో నడవక.. అప్పులు తీర్చలేక హైదరాబాద్ నగరంలో మరో ఆటో డ్రైవర్ బలవన్మరణానికి పాల్పడ్డాడు. వికారాబాద్ జిల్లా బాపల్లితండాకు చెందిన రాహుల్ అనే యువకుడు గురువారం సాయంత్రం నగరంలోని తన ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. బామినీ బాయి, బాలూనాయక్‌ల కుమారుడైన రాహుల్ ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇతని మరో ఇద్దరు సోదరులు జొమాటోలో డెలివరీ బాయ్స్‌గా పనిచేస్తున్నారు. స్నేహితులు, కుటుంబసభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉపాధి కోసం నగరానికి వలస వచ్చిన రాహుల్ బండ్లగూడలో ఇల్లు అద్దెకు తీసుకుని షేరింగ్ పద్ధతిన స్నేహితులతో కలిసి ఉంటున్నాడు. ఎనిమిది నెలల క్రితం అప్పుచేసి, ఆటో కొనుగోలు చేశాడు. ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్న రాహుల్ నెలవారి వాయిదాలు చెల్లిస్తూ అప్పు తీర్చుతున్నాడు. ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకంలో భాగంగా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడంతో ఆటోలను ఆశ్రయించే ప్రయాణికుల సంఖ్య తగ్గిపోయింది. గిరాకీ లేక రోజుకు కనీసం పెట్రోల్, గ్యాస్ డబ్బులు సైతం మిగలకపోవడంతో రాహుల్ తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. ఒకపక్క ఆటో కోసం చేసిన అప్పు తీర్చలేక, మరోపక్క కుటుంబ పోషణ భారమై గురువారం సాయంత్రం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయాన్ని గమనించిన స్నేహితులు వెంటనే పోలీసులు, కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. ఈ మేరకు ఘటనా స్థలికి చేరుకున్న రాజేంద్రనగర్ పోలీసులు కేసు నమోదు చేసి, శవ పంచనామా అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. పొట్టకూటి కోసం ముంబాయి వెళ్లిన తల్లిదండ్రులు చిన్నకుమారుడైన రాహుల్ మరణ వార్త తెలుసుకుని భోరున విలపిస్తూ స్వగ్రామానికి చేరుకున్నారు.

ఆదిలాబాద్ రైల్వేలైన్ ఏర్పాటు చేయాల్సిందే

- రైల్వే సాధన కమిటీ డిమాండ్
- పాత ఎన్‌హెచ్‌పై ధర్నా

ఎదులాపురం, జనవరి 19 : ఆదిలాబాద్ – ఆర్మూర్ రైల్వేలైన్ ఏర్పాటు చేయాలని రైల్వేలైన్ సాధన కమిటీ చైర్మన్ కాసవేణి నారాయణ యాదవ్ డిమాండ్ చేశారు. ఆదిలాబాద్‌లోని ఆర్‌అండ్‌బీ విశ్రాంతి భవనం సమీపంలో కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారం నాలుగో రోజుకు చేరుకున్నది. దీక్షా స్థలం నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. పాత జాతీయ రహదారిపై ధర్నా చేశారు. ఈ సందర్భంగా కాసవేణి నారాయణ మాట్లాడుతూ.. ఆదిలాబాద్–ఆర్మూర్ రైల్వేలైన్ జిల్లా ప్రజల చిరకాల కోరిక అని పేర్కొన్నారు. ఈ రైల్వేలైన్ పూర్తయ్యే వరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ నిరసనలో సాధన కమిటీ నాయకులు నిమ్మల నరేందర్, సిర్ర దేవేందర్, చిల్క దేవిదాస్ పాల్గొన్నారు.

నాగోల్‌లో సోనియాగాంధీకి ఉత్తరాలు పోస్ట్ చేస్తున్న బీఆర్ఎస్ నాయకుడు సతీశ్‌రెడ్డి

సోనియాగాంధీకి కరెంట్ బిల్లులు!

- పోస్ట్ చేసిన నాగోల్ బస్తీవాసులు
- 200 యూనిట్ల విద్యుత్తు బిల్లుల రద్దు హామీ ఏమైందంటూ ప్రశ్నలు

హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 19 (నమస్తే తెలంగాణ): ఎన్నికల సమయంలో కరెంట్ బిల్లులు తామే కడతామని చెప్పిన రేవంత్‌రెడ్డి.. అధికారంలోకి వచ్చాక పట్టించుకోవడం లేదని నాగోల్ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. 200 యూనిట్ల కరెంట్ బిల్లు మాఫీ చేస్తామన్న హామీ అమలు కావడం లేదని విమర్శించారు. తమ కరెంట్ బిల్లులు చెల్లించాలని కోరుతూ నాగోల్‌లోని పోస్టాఫీస్ నుంచి శుక్రవారం సోనియాగాంధీ ఇంటికి పోస్టుకార్డులు పంపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక రెండుసార్లు కరెంట్ బిల్లులు చెల్లించామని ఆ లెటర్‌లో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ వై సతీశ్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ హామీ నెరవేర్చకపోతే లక్షల్లో ఉత్తరాలు పంపిస్తామని హెచ్చరించారు.

మరోసారి ఓటు నమోదు తప్పదా?

- అయోమయంలో గ్రాడ్యుయేట్లు
- నత్తనడకన నల్లగొండ, వరంగల్, ఖమ్మం ఓటర్ల నమోదు

హైదరాబాద్, జనవరి 19 (నమస్తే తెలంగాణ): నల్లగొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల గ్రాడ్యుయేట్ నియోజకవర్గ ఓటర్లలో అయోమయం నెలకొన్నది. ఉప ఎన్నిక కోసం ఓటర్ల నమోదుకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఇప్పటికే ఓటర్లుగా నమోదు చేసుకున్నవారు తాము మళ్లీ చేసుకోవాల్సిన అవసరం ఉన్నదా? లేదా అనే గందరగోళం నెలకొన్నది. దీంతో ఇప్పటి వరకు తక్కువ సంఖ్యలో ఓటర్లుగా నమోదు చేసుకున్నారు. గతంలో 5.05 లక్షల ఓటర్లు ఉండగా, ప్రస్తుతం ఓటు హక్కు కోసం కేవలం 60 వేల మంది మాత్రమే ఇప్పటివరకు దరఖాస్తు చేసుకున్నారు. నల్లగొండ నియోజకవర్గ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా గెలిచిన పల్లా రాజేశ్వర్‌రెడ్డి జనగామ ఎమ్మెల్యే విజయం సాధించడంతో ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. దీంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. ఈ నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం ఉప ఎన్నికల నిర్వహణలో భాగంగా డిసెంబర్ 29న ఓటర్ల నమోదుకు షెడ్యూల్ విడుదల చేసింది. గ్రాడ్యుయేట్ నియోజకవర్గంలో ఓటు హక్కు నమోదు చేసుకోవడానికి ఫిబ్రవరి 6వ తేదీ వరకు అవకాశం కల్పించారు. ఫిబ్రవరి 24న ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రకటిస్తారు. ముసాయిదాపై మార్చి 14 వరకు అభ్యంతరాలను స్వీకరిస్తారు. ఏప్రిల్ 4న తుది ఓటరు జాబితాను ప్రకటిస్తారు.

మరోసారి నమోదు చేసుకోవాల్సిందే

గ్రాడ్యుయేట్ నియోజకవర్గానికి అర్హులైన ఓటర్లందరూ తమ ఓటు హక్కును మరోసారి నమోదు చేసుకోవాల్సిందేనని ఎన్నికల సంఘం స్పష్టం చేస్తున్నది. ఉప ఎన్నిక అయినా కూడా కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం అర్హులైన ప్రతి ఒక్కరూ కొత్తగా ఓటు హక్కు నమోదు చేసుకోవాల్సిందేనని స్పష్టం చేస్తున్నది. మూడు జిల్లాల పరిధిలో సాధారణ ఓటు హక్కు ఉన్న వారు డిగ్రీ పూర్తి చేసి మూడేండ్లు అయిన వారు తమ సంబంధిత పత్రాలతో ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోవాలని ఈసీ స్పష్టంచేస్తున్నది.

కోరుట్లలో సీఐడీ అధికారుల సోదాలు

- నకిలీ పాస్‌పోర్ట్‌లు స్వాధీనం

కోరుట్ల, జనవరి 19 : జగిత్యాల జిల్లా కోరుట్లలో శుక్రవారం సీఐడీ అధికారులు పలువురు పాస్‌పోర్టు ఏజెంట్ల ఇండ్లపై దాడులు నిర్వహించారు. నాలుగు బృందాలుగా ఏర్పడి మధ్యాహ్నం 2 గంటల వరకు స్థానిక పోలీసుల సాయంతో ముగ్గురు పాస్‌పోర్ట్ ఏజెంట్ల ఇండ్లల్లో సోదాలు చేశారు. హైదరాబాద్‌లోని సీఐడీ కార్యాలయంలో కోరుట్లకు చెందిన ముగ్గురు పాస్‌పోర్టు ఏజెంట్లపై నమోదైన కేసుకు సంబంధించిన దర్యాప్తులో భాగంగా అధికారులు వారి ఇండ్లల్లో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా అధికారులు పలు నకిలీ పాస్‌పోర్ట్‌లు, పాస్‌పోర్ట్ మార్ఫింగ్‌కు సంబంధించిన పరికరాలను స్వాధీనం చేసుకున్నట్టు తెలిసింది. పట్టణానికి చెందిన ముగ్గురు పాస్‌పోర్టు ఏజెంట్లను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టినట్టు సమాచారం.

డిప్యుటేషన్ల వివరాలు ఇవ్వండి: డీపీహెచ్

హైదరాబాద్, జనవరి 19 (నమస్తే తెలంగాణ): జిల్లాల్లో డిప్యుటేషన్, ఓడీ, వర్క్ ఆర్డర్ అరేంజ్‌మెంట్స్‌పై పనిచేస్తున్న వైద్యసిబ్బంది వివరాలను వెంటనే అందజేయాలని డీఎంహెచ్‌వోలను డీపీహెచ్ రవీంద్రనాయక్ ఆదేశించారు. ఉద్యోగి పేరు, హోదా, ఒరిజినల్ పోస్టింగ్, డిప్యుటేషన్ ఎక్కడికి, ఎప్పుడు, ఎంత కాలానికి? తదితర వివరాలతో సమగ్ర నివేదికను శనివారం నాటికి ఇవ్వాలని డీఎంహెచ్‌వోలకు సూచించారు. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఎస్సీల్లో సమాన వాటాకై ఉన్నత కమిటీ

- రాజీవ్‌గౌబా నేతృత్వంలో ఐదుగురు సభ్యులతో నియామకం
- ఈ నెల 23న ఢిల్లీలో కమిటీ తొలి సమావేశం

హైదరాబాద్, జనవరి19 (నమస్తే తెలంగాణ): షెడ్యూల్డు కులాల్లోని మాదిగలతో పాటు అన్ని ఉపకులాల వారి ప్రయోజనాలను పరిరక్షించేందుకు తీసుకోవాల్సిన పాలనాపరమైన చర్యలను పరిశీలించడానికి కేంద్ర ప్రభుత్వం శుక్రవారం ఓ ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటుచేసింది. ఎస్సీలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, రిజర్వేషన్లలో కొన్ని కులాలు, ఉపకులాలు మాత్రమే లబ్ధి పొందుతున్నాయని, దీంతో ఇతర కులాల వారు అన్యాయానికి గురవుతున్నారని, ఈ నేపథ్యంలో ఎస్సీల వర్గీకరణ చేపట్టాలని దళిత సంఘాలు దశాబ్దాలుగా పోరాడుతున్నాయి. ఈ అంశాన్ని పరిశీలించి, ఎస్సీలోని అన్ని కులాలకు సమాన వాటా దక్కేలా చూసేందుకు ప్రధాని సూచనతో క్యాబినెట్ సెక్రటరీ రాజీవ్ గౌబా నేతృత్వంలో కమిటీని ఏర్పాటు చేసినట్టు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. మాదిగలతోపాటు ఇతర గ్రూపుల వారి ప్రయోజనాలను పరిరక్షించేందుకు తీసుకోవల్సిన చర్యలను కమిటీ పరిశీలిస్తుందని పేర్కొన్నాయి. కమిటీలో కేంద్ర హోంశాఖ, సిబ్బంది–శిక్షణ శాఖ, గిరిజన వ్యవహారాలశాఖ, న్యాయశాఖ, సామాజిక న్యాయం సాధికారత శాఖలకు చెందిన కార్యదర్శులను సభ్యులుగా నియమించింది. ఈ కమిటీ ఈ నెల 23న సమావేశం కానుంది.

డిమాండ్ న్యాయమేనన్న కమిటీలు

ఎస్సీల వర్గీకరణ చేపట్టాలన్న దళితసంఘాల డిమాండ్ న్యాయసమ్మతమేనని గతంలో అనేక కమిటీలు తేల్చిచెప్పాయి. తెలంగాణ సహా పలు రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి నివేదించాయి. అయితే ఇప్పటివరకు దీనిపై ఎలాంటి నిర్ణయం జరగలేదు. ఇదిలా ఉండగా అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా హైదరాబాద్ విచ్చేసిన ప్రధాని మోదీ ఎస్సీ వర్గీకరణ సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. తాజాగా ఐదుగురు సభ్యుల కమిటీని కేంద్ర ప్రభుత్వం నియమించింది. ఇప్పటికే ఎస్సీ వర్గీకరణ అంశం సుప్రీంకోర్టులోని ఏడుగురు న్యాయమూర్తుల ధర్మాసనం పరిశీలనలో ఉండగా.. పలు ఇతర న్యాయస్థానాల్లో కూడా ఇదే అంశంపై వాదనలు కొనసాగుతున్నాయి.

కొర్విచెల్మలో బయటపడ్డ శ్రీరాముడి విగ్రహాలు

మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం కొర్విచెల్మ గ్రామంలో చింతం లచ్చన్నకు చెందిన భూమిలో బావి తవ్విస్తుండగా శ్రీరాముడి రాతి విగ్రహాలు బయటపడ్డాయి. దీంతో గ్రామస్థులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకొని పూజలు, అభిషేకాలు చేశారు. అయోధ్యలో 22న ప్రాణ ప్రతిష్ఠ జరుగనున్న వేళ విగ్రహాలు బయటపడటం ప్రాధాన్యత సంతరించుకొన్నది. – దండేపల్లి

బూత్‌స్థాయిలో కొత్త ఓటర్లకు సత్కారం

- రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్ రాజ్ వెల్లడి

హైదరాబాద్, జనవరి 19 (నమస్తే తెలంగాణ): ఈ నెల 25న జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా బూత్ లెవల్ అధికారి స్థాయిలో కొత్త ఓటర్లను సత్కరించి, వారికి ఓటర్ కార్డులు జారీ చేయాలని ఎన్నికల ప్రధానాధికారి వికాస్ రాజ్ పేర్కొన్నారు. 25న ఉదయం 11 గంటలకు రాష్ట్ర స్థాయిలో ఎన్నికల ప్రతిజ్ఞ తీసుకునేలా ఏర్పాటు చేయాలని ప్రధాన కార్యదర్శులకు రాసిన లేఖలో కేంద్ర ఎన్నికల సంఘం సూచించిందని వికాస్ రాజ్ తెలిపారు. ఈ అంశంపై రాష్ట్రస్థాయి ఎన్నికల నిర్వహణ యంత్రాంగాన్ని చైతన్యపరచడానికి శుక్రవారం ఉదయం సీఈవో వికాస్ రాజ్ సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. 14వ జాతీయ ఓటర్ల దినోత్సవానికి 'ఓటింగ్‌కు మించినదేదీ లేదు, నేను తప్పక ఓటేస్తాను' అనే ఇతివృత్తాన్ని ఎంపిక చేశారని చెప్పారు. 25న కూకట్‌పల్లిలోని జేఎన్టీయూ ఆడిటోరియంలో జరిగే కార్యక్రమానికి గవర్నర్ ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. బూత్‌స్థాయి నుంచి రాష్ట్రవ్యాప్తంగా జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహించాలని డీఈవోలతో సహా సంబంధిత అధికారులందరికీ వికాస్ రాజ్ ఆదేశాలు జారీచేశారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఈ కార్యక్రమం ద్వారా ఓటర్లకు విజ్ఞప్తి చేస్తామని వెల్లడించారు. కార్యక్రమానికి అదనపు సీఈవో లోకేశ్‌కుమార్ తదితరులు హాజరయ్యారు.

ఫ్రిజ్‌లో ఉంచని ఇన్సులిన్, మందులు సీజ్

- లైసెన్స్ లేకుండా మందులు సరఫరా చేస్తున్న వ్యక్తి అరెస్టు

అధికారులు స్వాధీనం చేసుకున్న ఇన్సులిన్, మందులు

హైదరాబాద్, జనవరి 19 (నమస్తే తెలంగాణ): ఫ్రిజ్‌లో నిలువ ఉంచాల్సిన ఇన్సులిన్ ఔషధాన్ని ర్యాకుల్లో పెట్టి అమ్మకాలు చేపట్టిన దుకాణంపై డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులు శుక్రవారం దాడులు చేశారు. మేడ్చల్– మల్కాజిగిరి జిల్లా కాప్రాలోని శ్రీ రాజరాజేశ్వర మెడికల్ డిస్ట్రిబ్యూషన్ ఏజెన్సీలో బయట నిలువ చేస్తున్నట్టు సమాచారం తెలిసిన అధికారులు తనిఖీలు చేపట్టారు. ఇన్సులిన్‌తోపాటు అక్రమంగా నిల్వచేసిన రూ.5 లక్షల విలువైన మందులనూ సీజ్ చేశారు. నగరంలోని అంబర్‌పేట పరిధిలోని పలు గోడౌన్లపై అధికారులు దాడులు చేశారు. ఈ సందర్భంగా ఎలాంటి లైసెన్స్ లేకుండా అక్రమంగా మెడికల్ షాప్‌లకు మందులను సరఫరా చేస్తున్న బషీర్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అతడి గోదాము నుంచి రూ.20.52 లక్షల మందులను స్వాధీనం చేసుకున్నారు. ఢిల్లీలోని ఆక్లెయ్ ఫార్మాలో తయారైన మందులను అక్రమంగా ఇక్కడి మెడికల్ షాపులకు సరఫరా చేస్తున్నట్టు గుర్తించారు.

ఎస్సీ కులాల జనగణన చేపట్టాలి

- బైరి వెంకటేశం

హైదరాబాద్, జనవరి19 (నమస్తే తెలంగాణ): ఎస్సీ వర్గీకరణ అమలుకు కేంద్ర క్యాబినెట్ కార్యదర్శి రాజీవ్ గౌబా నేతృత్వంలో ఐదుగురు సభ్యులతో కమిటీని ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తున్నామని ఎస్సీ ఉపకులాల హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు బైరి వెంకటేశం పేర్కొన్నారు. ముందుగా ఎస్సీల జనాభాను లెక్కించి దామాషా ప్రకారం రిజర్వేషన్ శాతాన్ని కేటాయించి సామాజిక న్యాయం అందించాలని అన్నారు. వర్గీకరణ అంశం సుప్రీం పరిధిలో ఉన్నందున న్యాయవాదిని నియమించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

రేపటి నుంచి అన్నారంలో రెండో విడత గ్రౌటింగ్

- నేడు అందనున్న అదనపు కెమికల్
- పరిశీలనలో మొదటి విడత పనులు
- బరాజ్‌లను సందర్శించిన బ్యాంకర్లు

జయశంకర్ భూపాలపల్లి (నమస్తే తెలంగాణ)/కాళేశ్వరం/మహదేవపూర్, జనవరి 19: జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం ప్రాజెక్టు మేడిగడ్డ(లక్ష్మి) బరాజ్‌లో కుంగిన పిల్లర్ వద్ద నిర్మాణ సంస్థ ఎల్‌అండ్‌టీ డైనాసార్, వాట్సన్ ఏజెన్సీలతో టెస్టింగ్ పనులు కొనసాగిస్తూనే ఉంది. టెస్టింగ్ పనులు పూర్తి కాగానే పిల్లర్ పునరుద్ధరణ పనులు ప్రారంభం కానున్నాయి. ఇక అన్నారం(సరస్వతి)లో 38, 28 ఔట్‌లెట్స్ వద్ద ఏర్పడిన సీపేజ్‌లకు నిర్మాణ సంస్థ ఆప్కాన్స్ గ్రౌటింగ్ పనులను కొనసాగిస్తున్నది. 25 మంది నిపుణులతో మొదటి విడత గ్రౌటింగ్ పనులు పూర్తి చేసింది. రేపటి (ఆదివారం) నుంచి రెండో విడత గ్రౌటింగ్ పనులు ప్రారంభించనున్నట్టు అధికారుల ద్వారా తెలిసింది. అందుకు అవసరమైన కెమికల్ శనివారం అన్నారం చేరుకున